క్లుప్తంగా

అభివృద్ధికి ప్రాధాన్యత

జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ



సర్పంచ్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న అనురాధ

ఆమనగల్లు: గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు నేనావత్ అనురాధ చెప్పారు. మండల పరిధిలోని మేడిగడ్డతండాకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.3లక్షల జెడ్పీ నిధులు అందాయి. ఈ మేరకు ఆమె సోమవారం సర్పంచ్ అమర్‌సింగ్‌కు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుని నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దోనాదుల కుమార్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ నారాయణ, నాయకులు రవీందర్‌నాయక్, శంకర్‌నాయక్, రాములు, లక్ష్మణ్, రమేశ్, వెంకటయ్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఎంపికైన విద్యార్థికి ఆర్థికసాయం

తలకొండపల్లి: ప్రతిభ గల పేద విద్యార్థులను ప్రోత్సహిస్తామని ఉప్పల ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని ఆర్లకుంట తండాకు చెందిన బాణావత్ కుమార్ అగ్నిపథ్‌కు ఎంపికయ్యాడు. శిక్షణకు ఒడిశాకు వెళ్తున్నాడు. ఆయన శిక్షణ ఖర్చులకు సాయం కోరడంతో స్పందించిన జెడ్పీటీసీ సోమవారం ట్రస్టు సభ్యుల ద్వారా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం, రామ్‌కుమార్, శ్రీను, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



శోభాయాత్రలో వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు

ఆమనగల్లు: మండల పరిధిలోని మంగళపల్లి గ్రామంలో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి మంగళపల్లి గ్రామంలోని అన్ని కాలనీల్లో ఈ యాత్ర కొనసాగింది. అనంతరం శివాజీ విగ్రహానికి పూలమాల వేసి పలువురు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులు

ఎస్‌ఐ వెంకటేశ్ యాదవ్

తలకొండపల్లి: అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటేశ్‌యాదవ్ హెచ్చరించారు. మండల పరిధిలోని జూలపల్లిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని సమాచారంతో పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు నిఘా వేసారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ సోమవారం తెలిపారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మేనేజర్ సుధీర్

మాడ్గుల: ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం నుంచి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును బ్యాంక్ మేనేజర్ సుధీర్ బాధితురాలికి అందజేశారు. మండల పరిధిలోని ఆర్కపల్లి చెందిన రైతు సిరసవాడ వెంకటయ్య మాడ్గుల ఎస్‌బీఐలో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకంలో చేరారు. ఇటీవల ఆయన మృతిచెందడంతో ఆయన భార్య లక్ష్మమ్మకు రూ.2లక్షల బీమా మంజూరైంది. ఈ మేరకు చెక్కును అందజేసినట్లు మేనేజర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌ఆఫీసర్ హరిచంద్ర పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు: మేయర్ దుర్గ

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ 43వ డివిజన్ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ వినతి మేరకు సోమవారం మేయర్ అధికారులతో కలిసి బస్తీలలో పర్యటించారు. ఈ మేరకు పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బస్తీల్లో అపరిశుభ్రత నెలకొనకుండా ఎప్పటికప్పుడు చెత్తను తరలించడంతో పాటు ఫాగింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ ఆర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

- ఘనంగా నందీశ్వరుడి రథోత్సవం
- ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు
- పెద్ద ఎత్తున హాజరైన భక్తులు



ఆమనగల్లు: అగ్నిగుండం నుంచి నడుస్తున్న భక్తులు



యాచారం: రథం లాగుతున్న భక్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లికార్జునస్వామి శివాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయంలో గణపతిపూజ, అభిషేకం, చక్రతీర్థం, సత్యనారాయణ స్వామి వ్రతం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివ, పార్వతుల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణం నుంచి గోపురం వరకు ఊరేగింపు చేపట్టారు. అనంతరం మల్లికార్జునస్వామి, భ్రమరాంబ దేవతామూర్తులకు మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో ఆలయ ప్రెసిడెంట్ మాకం పాండయ్య, ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ స్వప్న, కార్యదర్శి మల్లారెడ్డి, నిర్వాహకులు అశోక్, రాజు, బుచ్చిరెడ్డి, రాజునాయక్, రమేశ్‌నాయక్, విజేందర్‌రెడ్డి, మల్యానాయక్, శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి రథోత్సవం

కడ్తాల్: మండల పరిధిలోని ఏక్వాయిపల్లి మల్లన్నగుట్టపై వెలసిన మల్లికార్జున స్వామి జాతర బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఒగ్గుకథ, అగ్నిగుండాలు తొక్కే కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్ధరాత్రి రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మల్లన్న దేవాలయ ప్రధాన ధర్మకర్త బి.ఎట్టయ్యయాదవ్, వెంకటేశ్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అయ్యసాగరంలో అగ్నిగుండాలు

ఆమనగల్లు: రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం అటవీ క్షేత్రంలో వెలసిన త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు సోమవారం ఉదయం అగ్నిగుండాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు మఠం శేఖరయ్య ఆధ్వర్యంలో వీరభద్రస్వామి నందికోత్సవ సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిప్పుల గుండంలో నుంచి భక్తులు నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోన శ్రీనునాయక్, మల్లమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సరిత పంతునాయక్, ఆలయ కమిటీ సభ్యులు కరుణాకర్‌రెడ్డి, నర్సిరెడ్డి, మల్లప్ప, వీరయ్య, యాదయ్య, పంచాక్షరి, వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరాలయంలో..

యాచారం: మహా శివరాత్రి సందర్భంగా నందివనపర్తి గ్రామంలోని నందీశ్వరుడి రథోత్సవం సోమవారం తెల్లవారు జామున వైభవంగా నిర్వహించారు. స్వామి వారి రథాన్ని లాగేందుకు యువత పోటీపడ్డారు. శివనామస్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆదివారం రాత్రి మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, లక్ష్మీకళ దంపతులు పార్వతి పరమేశ్వరుల కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అబ్దుల్లాపూర్‌మెట్: పంచాయతీ కార్మికుల ఉద్యోగాల క్రమబద్ధీకరణ చేపట్టి వేతనాలు పెంచాలని వారు పాదయాత్ర చేపట్టారు. ఈ నెల 12న పాలకుర్తి నుంచి ప్రారంభమైన పాదయాత్ర బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి ప్రవేశించనుంది. సోమవారం సీఐటీయూ మండల కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ.. బుధవారం అనాజ్‌పూర్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అంజయ్య, చంద్రయ్య, సుధాకర్, మల్లమ్మ, సంపూర్ణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ కో కన్వీనర్‌గా విజయనాయక్

యాచారం: బీజేపీ అర్బన్ జిల్లా లీగల్ సెల్ కో కన్వీనర్‌గా తక్కళ్లపల్లి తండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ జర్పుల విజయనాయక్ నియమితులయ్యారు. జిల్లా కన్వీనర్ ప్రదీప్‌కుమార్, రాష్ట్ర జాయింట్ కో కన్వీనర్ రామారావు ఈ మేరకు సోమవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఈ సందర్భగా విజయనాయక్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒకే దఫాలో పంట రుణాలు మాఫీ

- రూ.500కే గ్యాస్ సిలిండర్
- పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి



హాత్ సే హాత్ జోడో యాత్రలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని జాపాల, కాగజ్‌ఘట్, ఆగాపల్లి గ్రామాల్లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం పేదల పొట్ట కొడుతూ.. పెద్దలను పోషిస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల పంటరుణాలు మాఫీ చేస్తామన్నారు. వంట గ్యాస్ రూ.500కే అందిస్తామని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన పాపం కేసీఆర్‌దే అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుండమోని జయమ్మ, మండల అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏర్పుల రాజు, జిల్లా కార్యదర్శి మునికుంట్ల సంతోశ్‌గౌడ్, మండల కో ఆప్షన్ సభ్యుడు వాజీద్, పీఏసీఎస్ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, నాయకులు సంజీవ, ప్రేమాకర్‌రెడ్డి, లింగంగౌడ్, సావత్‌రాజు, రమేశ్, దశరథ, జంగయ్య, కుమార్, అనిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో అమ్మమ్మ గ్రామం

- వారి జ్ఞాపకార్థం ఆస్పత్రి నిర్మిస్తా
- ప్రగతి నివేదన పాదయాత్రలో ప్రశాంత్‌కుమార్ రెడ్డి



చర్లపటేల్‌గూడలో వృద్ధులతో మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నా చిన్నప్పుడే ఈ గ్రామంలో తిరిగి ఆటలాడుకున్నానంటూ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి జ్ఞాపకాలను నెమరేసుకున్నాడు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర సోమవారం కర్ణంగూడ, చర్లపటేల్‌గూడ, తుర్కగూడ గ్రామాలల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా అమ్మమ్మ కంబాలపల్లి అండాలమ్మ, తాత నర్సింహారెడ్డి గ్రామమైన చర్లపటేల్‌గూడలో వారి జ్ఞాపకార్థం ఆస్పత్రిని నిర్మిస్తానని తెలిపారు. మా సొంతూరు ఎల్మినేడుపై ఉన్న ప్రేమే చర్లపటేల్‌గూడపై ఉందన్నారు. సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతన్నల అభివృద్ధికి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కర్ణంగూడలో పార్టీ మాజీ అధ్యక్షుడు యంపల్ల నిరంజన్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నల్లబోలు అంజిరెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, సర్పంచ్ గీతారాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గ రాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గణేశ్, ఎంపీటీసీ ఏనుగు భరత్‌కుమార్‌రెడ్డి, బీవైఎఫ్ నేతలు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజలకు భరోసా



మాట్లాడుతున్న అంజయ్యయాదవ్

కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యయాదవ్

యాచారం: బీజేపీతోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమనే భరోసాతోనే ప్రజలు పార్టీని ఆదరిస్తున్నారని కిసాన్ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని ధర్మన్నగూడం, చింతుల్ల, గడ్డమల్లయ్యగూడ గ్రామాల్లో సోమవారం ప్రజాగోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనతో విసిగెత్తి పోయారని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలన్నింటికి కేంద్రం నుంచి నిధులు మంజూరుచేస్తుంటే తాను ఇస్తున్నట్లు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీల్లో నిధులు లేక, బ్యాంకుల్లో వేసిన చెక్కులు పాస్‌కాకపోవడంతో సర్పంచ్ అప్పులు చేసి పాలన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, చింతుల్ల మాజీ సర్పంచ్ జగదీశ్ యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు నాగని యాదయ్య, నాయకులు శాంతికుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూములు పోకుండా వంతెన నిర్మించండి

బీఎస్పీ మున్సిపల్ అధ్యక్షుడు ప్రహ్లాద్

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో చాకిరేవు, చాకలి వాగులపై నూతనంగా నిర్మిస్తున్న వంతెనల కారణంగా పక్కనే ఉన్న దళితులకు చెందిన పట్టా భూములకు నష్టం వాటిల్లనుందని పెద్దఅంబర్‌పేట బీఎస్పీ అధ్యక్షుడు యంజాల ప్రహ్లాద్ ఆర్‌అండ్‌బీ అధికారులకు వివరించారు. వంతెన నిర్మాణం చేస్తున్న ప్రణాళికను మరోసారి పరిశీలించి పట్టా భూములను కోల్పోకుండా చూడాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆర్‌అండ్‌బీ డీఈ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం వంతెన నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూమి నుంచి వంతెన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని డీఈ హామీ ఇచ్చారని ప్రహ్లాద్ చెప్పారు.

ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవం

మంచాల: మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ నర్మద సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు, గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తారకరత్నకు నివాళి

ఇబ్రహీంపట్నం రూరల్: నందమూరి తారకరత్నకు టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డొంకని కిషోర్‌గౌడ్ నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్‌ఛాంబర్‌లో తారకరత్న మృతదేహానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు.

కంపెనీ మూసివేతకు దీక్ష



దీక్షలో కూర్చున్న కొత్తపల్లి గ్రామస్తులు

యాచారం: కొత్తపల్లి గ్రామంలో బొక్కల కంపెనీని మూసేయాలని గ్రామస్తులు చేపట్టిన దీక్ష సోమవారం 19వ రోజుకు చేరింది. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆందోళనకు మద్దతు తెలిపినా నేటికీ స్పష్టత రాకపోవడంతో ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. అధికారులు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుండాలు హెచ్చరించారు.

చిన్నారుల ఆరోగ్య రక్షణ సమష్టి బాధ్యత



సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది

కడ్తాల్: చిన్నారుల ఆరోగ్యరక్షణ సమష్టి బాధ్యతని కడ్తాల సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ, సహాయ కమిటీ ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందుతున్న సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు మహేశ్, భిక్షపతి, మల్లయ్య, రాంచంద్రయ్య, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ధనుంజయ్‌గౌడ్, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

వేతనాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయండి

సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ



ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

మంచాల: పంచాయతీ కార్మికుల వేతనాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారానికి మండల కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరునెలలుగా పంచాయతీ కార్మికుల వేతనాలు నిలిపివేయడం సరికాదన్నారు. అనంతరం ఎంపీఓ తేజ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు ఖాజా పాష, జంగయ్య, రవి, దాసు, చెన్నయ్య, శంకర్, యాదయ్య, ప్రభాకర్, హరి, వెంకటయ్య, నర్సింహ, లక్ష్మి, సుజాత, సుగుణ, బాలమణి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ధర్నా

ఆమనగల్లు: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళశాల ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి ఐదేళ్లు కావస్తోందని.. ప్రభుత్వం నుంచి ఇప్పటికీ కళాశాల ఏర్పాటుకు ఎటువంటి చర్యలు ప్రారంభించలేదని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మహేశ్, ఫరీద్ మాట్లాడుతూ.. 2018 ఎన్నికల సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు లక్ష్మణ్, బాలకృష్ణ, లతీఫ్, యశ్వంత్, ధనుష్, గౌస్, సాయి, పవన్, నవీన్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లి, హర్యానాయక్‌తండాల్లోని కంటి వైద్య శిబిరాల్లో వైద్యులు సోమవారం 382 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు కల్పన, స్నేహ, సైదమ్మ తెలిపారు. అవసరం ఉన్నవారిని కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున్, హెచ్‌ఏ మల్లయ్య, రామచంద్రయ్య, నర్సింహ, శివకుమార్, నాగమల్లీశ్వరి ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోలెపల్లి గ్రామంలో 132 మందికి..


ఆమనగల్లు: ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం 132 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలరాం, ఉపసర్పంచ్ అంజన్‌రెడ్డి, ఎంపీటీసీ కుమార్, డాక్టర్లు పరిక్షిత్, మంజులాదేవి, సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్‌భవానికి సామాజిక సేవా పురస్కారం

హయత్‌నగర్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, రంగారెడ్డి జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి చింతల రాకేశ్‌భవానికి అస్తిత్వం సంస్థ సామాజిక సేవా పురస్కారాన్ని అందించింది. ఈ మేరకు నగరంలోని రవీంద్రభారతీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు జడ్జి మురళీమోహన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రాకేశ్‌భవాని మాట్లాడుతూ... ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా, కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారిగా, నెహ్రూ యువ కేంద్రం కమిటీ సలహా సభ్యుడిగా తన సేవలను గుర్తించిన అస్తిత్వం సంస్థ తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అస్తిత్వం సంస్థ నిర్వాహకులు చింతలూరి మంజులాకౌర్, సలహాదారు కృష్ణవేణి, హెల్త్ కౌన్సిలర్ హిప్నో పద్మాకమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమిని కాపాడండి

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్‌లో గ్రామకంఠం భూమిని కాపాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం మున్సిపల్ కమిషనర్ సాబేర్‌అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య మాట్లాడుతూ.. కొందరు అక్రమార్కులు ప్రహరీ నిర్మించి భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డి.జగదీశ్, డి.కిషన్, టి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలివ్వండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



ఆర్డీఓ కార్యాలయం ముట్టడిలో పాల్గొన్న సీపీఐ నాయకులు

తుర్కయంజాల్: ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తుర్కయంజాల్‌లోని ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమ్ముకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు, పేదలు 60 గజాల స్థలం కోసం గుడిసెలు వేస్తే తొలగించి కేసులు నమోదు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు లేని వారికి పంపిణీ చేయాలని, లేని పక్షంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసే ప్రక్రియను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.